"కమల వంటింట్లో ఏం చేస్తోంది మమ్మీ?" అడిగింది రాణి. సరస్వతమ్మ కూతురిని ప్రేమగా చూచింది. చేతిలో వున్న టీ పాట్‌ను బల్లమీద వుంచింది. తరువాత కూతురి వైపు తిరిగి "వెళ్ళి చూడవే! ఏం ప్రయోగాలు చేస్తోందో!" అంది.

వాలు కుర్చీలో పండుకున్నాడు కృష్ణారావు. సాయంత్రం ప్రచురణ అయ్యే దినపత్రిక చదువుతున్నాడు. తల్లీ కూతుళ్ళ మాటలు వింటూ దిన పత్రికను వాల్చి యిద్దరినీ పరధ్యానంగా చూచి తిరిగి చదవడంలో మునిగిపోయాడు.

# ఒక పుర్రె రెండు ఎముకలు

## ఎమ్. వి. వి. సత్యనారాయణ

రాణి హుషారుగా వంటింట్లోకి వెళ్ళింది.

"మీకు టీ ఇవ్వనా?" అడిగింది సరస్వతమ్మ.

కృష్ణారావు తలూపాడు.

టీ చప్పరిస్తూ, "రాత్రికో రేపటికో వాయుగుండం బలరేగవచ్చును. బంధువులు ఎవరూ రాకుండా వుంటే బాగుండును" అన్నాడు.

సరస్వతమ్మ నవ్వి "ఆ విషయంలో నేనేం చెప్పలేను కాని... రేపో మాపో మన ఇంటికి కమల వాళ్ళ నాయనమ్మ వస్తే రావాలి. అన్నట్టు మీరు తొందరగా తేల్చివేయాలి. ముసలిది వెళ్ళాక ఇక ఎన్నో రోజులు మనం ఇలా కాచుకోకూడదు" అంది.

"నాకు తెలియదంటావా? ప్రజల దృష్టిలో మనం మంచిగా వుండాలి."

"రాణికి మంచి సంబంధం చూసి పెళ్ళి చెయ్యాలి. మనకో మంచి ఇల్లు కొని వుంచండి. ఎంతకాలం ఇలా అద్దె ఇళ్ళలో..."

కృష్ణారావు ఖాళీ కప్పును భార్యకు అందించాడు. మరో అయిదు నిమిషాల పాటు భార్యాభర్తలు గుసగుస లాడుకున్నారు. గది బయట అలికిడయింది. ఇద్దరూ మౌనంగా వుండిపోయారు. సరస్వతమ్మే ముందుగా తేరుకుని కప్పులతో వాష్‌బేసిన్‌వైపు కదిలింది.

కమలను నడిపించుకుంటూ రాణి ఆ గదిలోకి వచ్చింది.

"చూడు డాడీ! కమలకు జ్వరం తగిలినట్టుంది. మాత్ర ఇస్తానంటే వేసుకోదట! మూర్ఖత్వం కాదా?" అంది రాణి.

కమల నీరసంగా వున్నప్పటికీ లేని హుషారు తెచ్చుకుని "జ్వరం లేదు అంటే వినదు నాన్నగారూ!" అంది.

కృష్ణారావు నవ్వి, "రోగం వున్నట్టుగా రోగి చెప్పదు. ఎదుటివాళ్ళు తెలుసుకునేలాగా ప్రవర్తిస్తారు" అని రాణివైపు తిరిగి "కమలకు కాస్త టీ ఇవ్వు. బయటి వాతావరణం చలిగా వుంది కదా!" అన్నాడు.

రాణి టీపాట్‌లోంచి టీ వొంపి కప్పు అందించింది. కమల అందుకుని రాణివైపు మురిపెంగా చూచి మెల్లగా చప్పరించసాగింది.

కృష్ణారావు ఆమె తాగుతున్న కప్పు వైపే చూచి, "రాణీ! ఎవరి కప్పులలో వాళ్ళే తాగడం ఆరోగ్యకరం అని చెప్పానా? నువ్వు మరిచిపోయావు!" అన్నాడు.

రాణి నవ్వి వూరుకుంది. సరిగ్గా అప్పుడే వీధి గుమ్మం మీద టకటక చప్పుడయింది.

"హు! ఇప్పుడే అనుకున్నాను. ఎవరో అతిథి వచ్చిపడి వట్టున్నాడు. సరసూ! తలుపు తెరువ్!" అన్నాడు కృష్ణారావు.

సరస్వతమ్మ అటువెళ్ళి తలుపు తెరిచింది. బయట సన్నటి తుంపర పడుతోంది. తలుపు తెరవగానే చల్లటి గాలి దూసుకువచ్చింది. పెరట్లో వెలిగే లైటు వెలుతురులో ఆమెను తేరిపార చూచింది సరస్వతమ్మ.

ఆమె తడిసిపోయి వుంది. చలికి కాబోలు వణుకుతోంది. తడిసిన బట్టలు ఆమె వొంటికి అతుక్కుపోయి ఆమెను ఇంకా వణికిస్తున్నాయి. ఇంటిచుట్టూ బహిరంగ వాతావరణం కావడంతో చలి మరీ ఎక్కువగా వుంది.

"ప్లీజ్! లోపలికి రానిస్తారా? వర్షంలో తడిసి ముద్ద అయిపోయాను. ప్లీజ్... దయవుంచండి!" అన్నదామె.

సరస్వతమ్మ అనుమానంగా చూచి ఆమెకు దారి ఇచ్చింది.

ఆమె లోపలికి వచ్చింది. ఆమె వస్తోంటే దుస్తుల మీది తడి సరస్వతమ్మకు అంటి జివ్వుమని లాగింది.

చటుక్కున తలుపు మూసింది సరస్వతమ్మ.

"ఎవరమ్మా మీరు?" అడిగాడు కృష్ణారావు.

"నన్ను సౌజన్య అంటారు. ఊరు మధ్యలో వుండగానే తుంపరలు ప్రారంభమయ్యాయి. క్రమంగా వర్షం పెద్దదయింది. పొలిమేరలలోకి వచ్చేసరికి కారు ట్రబులివ్వడం మొదలుపెట్టింది. కారు ఒక చెట్టు కింద ఆపి చుట్టూ చూశాను..." పమిటచెంగుతో తలవొత్తుకుంటోంది సౌజన్య.

"వారికి టర్కిష్ టవల్ ఇవ్వు కమలా!" అని, సౌజన్యను చూసి, "ప్రశాంతత కోసం వూరికి దూరంగా వుంటున్నాం. మన సిటీ స్టీల్ సిటీ అవుతోంది. వాతావరణ కాలుష్యమూ, జన సంకీర్ణమూ, కార్లూ, గందరగోళమూ నాకు ఇష్టం వుండదు!" అన్నాడు కృష్ణారావు.

కమల ఆమెకు టర్కిష్ టవల్ అందించింది. సౌజన్య తలవొత్తుకుంటోంది.

"కారుచీకట్లో కాంతి రేఖలాగా మీ ఇంట్లో దీపం వెలుగుతూ కనిపించింది. అతి కష్టంమీద కాలిబాట పట్టుకోగలిగాను" అంది సౌజన్య.

రాణి టీ కప్పు అందుకుని పాట్‌లోంచి టీ వొంపబోయింది. కృష్ణారావు ఒక్క క్షణంపాటు ఇబ్బందిగా కదిలి, చటుక్కున టీ పాట్ అందుకుని పేపర్ కుర్చీలోకి విసిరి లేచి నిలబడ్డాడు. మొహంలోకి ప్రశాంతతను కొనితెచ్చుకున్నాడు.

"టీ చల్లారిపోయిందమ్మా!" అన్నాడు. అంటూనే వాష్‌బేసిన్‌వైపుగా నడిచి టీని బేసిన్‌లోకి వంపేసాడు. సౌజన్య అందరి మొహాలనూ ఒకసారి ఒకే చూపులో పరిశీలించి బేసిన్‌వైపు చూసింది.

పింగాణీ మీద నుండి పొగలు రేగుతున్నాయి.

"సరసూ! మన అతిథికి ఫ్రెష్‌గా టీ ఇవ్వు!" అన్నాడు కృష్ణారావు. సరస్వతమ్మ మౌనంగా టీ పాట్‌ను అందుకుని లోపలకు వెళ్ళిపోయింది.

"వీరిని పై గదిలోకి తీసుకువెళ్ళమ్మా! నీ బట్టలివ్వు రాణీ! దుస్తులు మార్చుకుంటారు. కమల టీ తీసుకు వస్తుంది!" అని సౌజన్య వైపు చూశాడు కృష్ణారావు.

"ఉదయాన్నే వచ్చిన వర్షమూ, చీకటిపడి వచ్చిన అతిథీ అంత త్వరగా వెళ్ళడం జరగదు. చూడండి! మీకు, అభ్యంతరం లేకపోతే ఈ రాత్రికి ఇక్కడే వుండిపోండి!" అన్నాడు.

సౌజన్య కృతజ్ఞతలు చెప్పుకుంది. రాణి పైకి దారి తీసింది. సౌజన్య చెక్క మెట్ల మీద మెల్లగా అడుగులు వేసింది.

టీ కప్పు సాసర్‌లో వుంచుకుని కమల ఆ గదిలోకి అడుగుపెట్టింది. సౌజన్య బెడ్‌మీద కూర్చుని గదిని పరిశీలిస్తోంది.

"రా అమ్మా! నీ పేరేమిటి?" అంది సౌజన్య.

"కమల!" అంది టీ అందిస్తూ.

"రాణీ నీకు చెల్లెలవుతుందా?" అంది సౌజన్య.

కమల తలూపింది.

"మీరిద్దరూ చదువుకుంటున్నారా?"

"నేను బి.ఎస్‌సి. మధ్యలో మానేశాను!"

"ఏం?" ఆమె టీ చప్పరిస్తోంది.

"నాన్నగారికి ఇష్టంలేదు. ప్రైవేట్‌గా బి.ఎ. చదవమన్నారు!"

"రాణి విషయమో..."

"రాణి టెన్త్‌తో ఆపేసింది. ఈ ఏడాది ఎంట్రెన్సు బి.ఎ. పరీక్ష రాస్తానంటోంది. ఎలా జరుగుతుందో!"

"ఈ గది దుమ్ము కొట్టుకుపోయి వుంది. ఎవరూ వాడడంలేదా?"

"... ..."

"కమలా! చెప్పడం ఇష్టంలేకపోతే పోనీలే."

"అదేం కాదండీ! ఈ ఇల్లు చౌకగా వచ్చింది కదాని నాన్నగారు అద్దెకు తీసుకున్నారు. తర్వాత తెలిసింది. ఈ గదిలో ఇంతకుముందు ఎవరో వురి పోసుకు చచ్చిపోయారట. ఎవరయినా పై వారు వస్తే మాత్రమే ఈ గది ఇస్తారు నాన్నగారు."

"అయితే.. అంత మాత్రాన ఈ గదిని పాడుపెట్ట నక్కరలేదు కదా!"


"ఏమోనండి! ఈ గదిలోకి రావాలంటే నాకు భయం. ఎవరో చెక్క మెట్లమీద నుండి ఎక్కుతున్నట్టు అలికిడవుతుంది. నా వెనుక ఎవరో గాలిలో వ్రేలాడుతూ కాళ్ళు నాకు తాకిస్తోన్నట్టుగా తోస్తుంది. మెడమీద చల్లటి వ్రేళ్ళు తగులుతాయి."

"అవన్నీ నీ భ్రమలు! ఈ భూమి మీద దయ్యాలు లేవు!"

ఆమె తల అడ్డంగా తిప్పి, "మా పెరట్లో ఎన్నో సార్లు చూశాను. మొక్కలు కదుపుతుంది. అటు చూస్తే ఏమీ వుండదు. ఎవరో నడిచివెళ్తున్నట్టుగా అలికిడవుతుంది. నాకు గుండెలవిసిపోతాయి. ఇక ఆ రాత్రంతా నిద్ర వుండదు."

సౌజన్య కప్పు, సాసర్ టీపాయ్ మీద వుంచి, ఆమె కళ్ళకింద భాగం తడిమింది. "నీకీ వయసులోనే మొహం ముడతలు పడుతోంది. కళ్ళచుట్టూ నల్లటి వలయాలు ఏర్పడుతున్నాయి. అద్దంలో చూసుకున్నావా?" అంది.





"అంతే కాదండీ! ఒంట్లో నీరసంగా వుంటోం దండి! ఏ పనీ చెయ్యబుద్ధి కావడంలేదు. అన్నం హితవు కావడంలేదు."

"డాక్టర్‌కి చూపించుకున్నావా?"

"నాన్నగారు ఒప్పుకోరు! బాగా తిను. టానిక్కులు వాడు. వాళ్ళు మందుల మీద మందులూ, ఇంజెక్షన్లమీద ఇంజెక్షన్లూ వాడిస్తారంటారు."

సౌజన్య కనుబొమ్మలు చిట్లించింది. కృష్ణారావు వింత మనిషి! ఇంట్లో ప్రతి విషయాన్ని అతడు శాసిస్తున్నాడు. ఎవరి కష్టాలు వాళ్ళే వాడాలన్నంత పట్టు దల వున్నవాడు. అమ్మాయిని డాక్టర్ వద్దకు వెళ్ళ నివ్వడు. విచిత్ర మనస్తత్వం! పూరి బయట ప్రశాంతత కోసం ఇల్లు కట్టుకున్నాడు. పిల్లను అనారోగ్యం పాల పడేస్తున్నాడు. పైగా కమలకు దెయ్యాల పట్ల నమ్మకం వుంది. ఆ నమ్మకం ఆమెను కుంగదీస్తూ వుండ వచ్చును.

మెట్లమీద చప్పుడయింది. కమల ఓర చెవులతో విని, "మా నాన్నగారు!" అంది. ఆమె మొహంలో నిర్లిప్తత కనిపిస్తోంది. కప్పు, సాసరు అందుకుంది. సౌజన్య లేచి గుమ్మం వైపు కదిలింది. కృష్ణారావు గుమ్మం ముందు ప్రత్యక్షమయ్యాడు.

"మా అమ్మాయి మిమ్మల్ని విసిగిస్తోందా?" అన్నాడు కృష్ణారావు.

"అబ్బే లేదండి! నాకే కాలక్షేపం కాక నేనే విసి గిస్తున్నానేమో!"

కమల ఇద్దరినీ తప్పించుకుని మెట్లు దిగి వెళ్ళి పోయింది.

"గుడ్‌నైట్" అన్నాడు కృష్ణారావు వెనక్కి తిరగ బోయి.

"సార్! చిన్న సందేహం. అడగవచ్చునా?" అంది సౌజన్య.

కృష్ణారావు చిరునవ్వు నవ్వి, "తప్పకుండా. అయితే ఈ ఇంట్లో దెయ్యాలు తిరుగుతున్న విషయం మాత్రం అడగకండి! దెయ్యాలు నాకు కనిపించవు" అన్నాడు.

సౌజన్య నవ్వి, "అవి మీకే కాదు. ఎవరికీ కనిపించవు లెండి. కమలకూ రాణికి పోలికలలో చాలా తేడాలు వున్నాయి. ఇద్దరూ ఒక తల్లి బిడ్డలు కారా?" అంది.

కృష్ణారావు ఇంకా నవ్వుతోనే, "అదేమిటి? ఒక తల్లిబిడ్డలే!" అన్నాడు.

"సారీ నేను పొరబడ్డాను. కవలికలు తేడా అని పించాయి. అంతే!"

"ఫరవాలేదు. నిద్రపోండి!" అతడు వెనక్కి తిరిగాడు.

"గుడ్‌నైట్!"

"గుడ్‌నైట్!"

సౌజన్య మృదువుగా తలుపు చేరవేసి బెడ్ వద్దకు వెళ్ళింది. ఆమెకు మనసు నిండా విచిత్రమైన ఇంట్లో వెలకొన్న మనస్తత్వాల మీద వింత అవగాహన ఏర్పడి పోయి వుంది.

కృష్ణారావు నియంత. సరస్వతమ్మ అతడి నియంతృ



ప్రగతిపథంవైపు ప్రయాణం —శంకర్

త్వాన్ని కావాలని భరిస్తోంది. రాణీ, కమలా ఒకే తల్లికి పుట్టిన బిడ్డలు కారు. కృష్ణారావు తనకు అబద్ధం చెబు తున్నాడు. కమలకు ఈ ఇంట్లో దెయ్యం చూచిన అనుభూతి కలుగుతోంది. దెయ్యం అబద్ధం! అనుభూతి నిజం! అనుభూతిని ఎవరో కావాలని ఆమెకు కలిగిస్తు న్నారు. కమల లోతుగుండె మనిషి.

కృష్ణారావు కూతురు రాణి చాలా తెలివైన అమ్మాయి. ఇంటి విషయాలు ఆమె నుండి రాబట్టాలని ఎంత ప్రయత్నించినా ఆమె కొరుకుడు పడలేదు. తండ్రి గురించి కానీ తల్లి గురించి కానీ ఆమె తన అభిప్రాయాలు ప్రకటించకుండా జాగ్రత్తపడింది. కమల పట్ల ప్రేమ ప్రకటించింది. కాని ప్రేమ ప్రకటన వెనుక అసూయ వున్నట్టు తనకనిపించింది.

తనకీ ఇంట్లో ఒక్క రాత్రి గడిపే అవకాశం మాత్రమే వుంది. తాను ఈ ఇంటి మర్మం బయటికి లాగగలుగుతుందా?

సౌజన్య కిటికీవద్దకు వెళ్ళి నిలబడింది. దూరంగా షిప్‌యార్డ్, కోరమాండల్ ఫెర్టిలైజర్‌లాంటి కర్మా గారాల దీపాలు ప్రకాశవంతంగా మెరుస్తున్నాయి. నగర వాతావరణం గంభీరంగా వుంది. ఆకాశంలో జెట్ మబ్బులపైగా వెళ్తోంది. అకస్మాత్తుగా పెరట్లో ఎవరో కదిలినట్టయింది. మొక్కల మధ్య అలికిడయింది.

సౌజన్య క్రిందకు చూచింది. కృష్ణారావు! అతడు తన కిటికీ తిన్నగా కింద నిలబడి పైకి చూస్తున్నాడు. పెరట్లో దీపం వెలిగించుకుని మరీ వచ్చాడు.

"మీరింకా నిద్రపోలేదా?" కేకపెట్టాడు కృష్ణారావు.


సౌజన్య తడబడింది. అతడు తనను కూడా ఆదేశించగలడన్న విషయం ఆమె ఊహించలేదు.

"ఎలక్ట్రిక్ మీటర్ ఇంకా తిరుగుతోంది! అందుకే మిమ్మల్ని గమనించాలని ఇటువచ్చాను!"

"ఒక్క అయిదు నిమిషాల్సార్! దీపాలు తోరణాల్లాగా కనిపిస్తోంటే ఆనందంగా చూస్తున్నాను."

కృష్ణారావు తలూపి లోపలకు వెళ్ళిపోయాడు. పెరట్లో దీపం ఆరిపోయింది. సౌజన్య బెడ్ వద్దకు వెళ్ళింది. బెడ్ మీద కూర్చుంది. టీపాయ్‌మీద దుమ్ము పేరుకుపోయి వుంది. దుమ్ములో వ్రేలితో రాయ బోయింది. చటుక్కున వ్రేలు బయటికి లాక్కుంది.

టీపాయ్‌మీది దుమ్ములో బొమ్మ గీచివుంది. పుర్రె బొమ్మా, దాని క్రింద రెండు ఎముకలూ ఒకదాని మీద మరొకటి వున్నట్టు బొమ్మ చిత్రించివుంది. సౌజన్య కళ్ళు దగ్గరగా పెట్టి చూచింది. బొమ్మ స్పష్టంగా వుంది. ఎవరు చిత్రించారు ఈ బొమ్మ! గీతలు స్పష్టంగా వున్నాయి. గీతలలో దుమ్ము పడలేదు. అంటే ఇవి తాజా గీతలన్నమాట. ఈ గదిలోకి రాణీ, కమలా మాత్రమే వచ్చారు. కృష్ణారావు గుమ్మంలోంచే తిరిగి వెళ్ళిపోయాడు. రాణి ఎక్కువసేపు లేదు ఈ గదిలో. కమల ఇక్కడ వున్నంతసేపూ తనతో మాట్లాడుతూనే





విజయ భావన సాహితీ మిత్ర సమాఖ్య విజయనగరంలో ఇటీవల ఏర్పాటుచేసిన సాహితీ స్రవంతి కార్యక్రమంలో 'సమకాలీన సాహిత్యం-విలువలు' అన్న అంశంపై ప్రసంగిస్తున్న డాక్టర్ ఎస్. విజయలక్ష్మి కుమారి, డాక్టర్ వాగంటి తులసి, కుమారి ఎం. రాజ్యలక్ష్మి వేదికపై వున్నారు.

వుంది.

గదిలో దీపం ఆరిపోయింది. కృష్ణారావు మెయిన్ స్విచ్ ఆపేసి వుంటాడు. తనతో ఏమీ మాట్లాడుతుండగానే కృష్ణారావు వచ్చాడు. కమల తనకు వెనుక భాగంలో వుంది. కృష్ణారావుతో మాట్లాడే సమయంలో ఆమె దుమ్ములో ఒక పుర్రె, రెండు ఎముకలూ చిత్రించి వుండవచ్చును.

సౌజన్య ఉలిక్కిపడింది. కమల ఆ బొమ్మ చిత్రించడంలో అర్థం వుంది. ఆమె ప్రాణం ప్రమాదంలో వుంది. ఆమెకు ప్రమాదం తీసుకువస్తోన్న వారెవరు? కృష్ణారావు కాదు కదా! కమల తెల్లవారేవరకు బతికే వుంటుంది. ఆ విషయంలో సందేహం లేదు.

సౌజన్య బెడ్‌మీద వాలిపోయింది. ఆమెకు ఎప్పుడు నిద్రపట్టిందో పట్టింది.

3

"చూడు రాణీ! మన అతిథి నిద్రలేచిందో లేదో..." అన్నాడు కృష్ణారావు. రాణి మెట్లు ఎక్కి పై గదిలోకి వెళ్ళింది. గదిలో సౌజన్య లేదు. కిటికీలోంచి పెరట్లోకి చూసింది. దూరంగా కొండ అంచుల మీద ఆమె నడుస్తోంది. చీర రంగును బట్టి సౌజన్యను గుర్తుపట్టింది.

కొండ దిగింది సౌజన్య. కింద జలాశయం వుంది. జలాశయంలో కమల స్నానం చేస్తోంది. సౌజన్య నీటి అంచున ఆగింది. కమల నవ్వుతూ చూచింది. సూర్యోదయం వెలుగు ప్రకృతిమీద పరుచుకుంటోంది. నీటి మీద వింత రంగు అద్దుతోంది సూర్యోదయం. వాయుగుండం తేలిపోయింది.

"మీరూ స్నానం చేస్తారా? ఎంత హాయిగా వుందో?"


N నారాయణ కోచింగ్ సెంటర్

14/72 హరనాథపురం -నెల్లూరు

ఫోన్: 6276

1988 EAMCET మొదటి బ్యాచ్ (Intensive Coaching) 31-7-87;
రెండవ బ్యాచ్ 14-8-87; మూడవ బ్యాచ్ 4-9-87.

కనీసం 80% వచ్చినవారు మాత్రమే మొదటి బ్యాచ్ (Intensive Coaching Batch)కి అర్హులు. సీటు కావలసినవారు రు. 300/-M.O./D.D. ద్వారా పంపి రిజర్వు చేసుకొనవచ్చును.

పోస్టల్ కోచింగ్

1988 — EAMCET కి పోస్టల్ కోచింగ్ 14-8-87 నుంచి ప్రారంభించబడును. పోస్టల్ కోచింగ్ పద్ధతి 1) పూర్తి మెటీరియల్ మొదటి దఫా ఇవ్వబడును. 2) 15 రోజుల కొకసారి ప్రశ్న పత్రములు పంపబడును. ఇతర వివరాలకు పోస్టు ద్వారా లేక ప్రత్యక్షంగా సంప్రతించండి.

N నారాయణ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజి

అడ్మిషన్లు ప్రారంభమైనవి



నూతన యవ్వనం పొందండి

సంతానవంతులుకండి!



చర్మ వ్యాధుల నుండి విముక్తులుకండి!

దురభ్యాసముల వలన కలిగిన నరముల బలహీనత, దాంపత్య సుఖము లేక పోవుట, ఉబ్బసము, మేహ మచ్చలు, మొదలగు సమస్త దీర్ఘ వ్యాధులకు ఆయుర్వేద చికిత్స! పోస్టుద్వారా చికిత్స కలదు.

క్యాంపులు:* ప్రతి ఆదివారం భీమవరం-షణ్ముఖ లాడ్జిలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6-30 గంటల వరకు.
* ప్రతి నెల 1 మరియు 16 తేదీలలో రాజమండ్రి-హోటల్ అశోకాలో కోటగుమ్మం దగ్గర మధ్యాహ్నం 12 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు.

డా॥ డి. మార్కండేయులు

ఆయుర్వేదభిషక్, సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్

పార్కురోడ్, గుడివాడ - 521 301

ఫోన్స్ : ఆఫీసు : 522 నివాసం : 540

అంది కమల.

"స్నానం చెయ్యాలనే వుంది. కాని అందుకు సిద్ధపడి రాలేదు."

"ఫరవాలేదు. ఈ దారిలో ఎవరూ రారు. తడి చీరతో వెళ్ళిపోవచ్చు."

సౌజన్య నవ్వి వూరుకుంది. "రాత్రి బొమ్మ బాగా గీచావ్!" అంది.

కమల వులిక్కిపడలేదు.

"నీ విషయమే మాట్లాడేది!, చెప్పు! రాత్రి నువ్వే గీచావ్!"

"ఏ బొమ్మ గురించి మీరు మాట్లాడేది?"

"ఒక పుర్రె, రెండు ఎముకలూ!"

కమల వొళ్ళు తోముకుంటోంది. "నాకు తెలియదండి!"

"నాకు తెలుసు. వేలిముద్రలు టీపాయ్ మీద దుమ్ములో పడతాయి. వాటిని నీ వేలిముద్రలతో పోల్చి చూస్తాను! అప్పుడు అబద్ధం చెప్పినందుకు నువు సిగ్గు పడతావ్!"

"మీరెవరు?"

"మరియమ్మ పంపించింది!" ఆమె మొహంలోకి చూస్తోంది సౌజన్య. ఆమె ఆశించినట్టే కమల మొహంలో రంగులు మారాయి.

"మ...రి...య...మ్మ... మీకెలా తెలుసు?"

"ఆమె తరఫున క్రిమినల్ లాయర్‌ను నేను! నీ చేతికి ఆస్తి ఇచ్చేముందు నువ్వున్న పరిస్థితులనూ, నీ పెంపుడు తలిదండ్రుల మనో భావాలనూ సహజ పరిస్థితులలో గమనించాలని మరియమ్మ అభిప్రాయపడింది. ఆమె అభిప్రాయపడడంలో తప్పు చేయలేదని నువ్వూ ఒప్పుకుంటావ్! అవునా!"

కమల మెల్లిగా ఒడ్డుకు వచ్చింది. ఆమె చూపులు నేలవాలిపోయి వున్నాయి.

"సారీ! క్షమించండి! మీతో అబద్ధం చెప్పాను. బొమ్మ గీచింది నేనే!"

సౌజన్య స్నేహపూర్వకంగా చూసి, "ఆర్.టి.సి. బస్సు ప్రమాదంలో మీ అమ్మా-నాన్నా చనిపోయారు. నువ్వు అప్పటికి పన్నెండేళ్ళ పిల్లవి. ఆరేళ్ళపాటు కృష్ణారావూ సరస్వతీ నిన్ను పెంచారు. ఈ నెలలో నీకు మైనారిటీ తీరిపోయి మీ పిత్రార్జితం అందించవలసి వుంది. నువ్వు మేజర్‌వి కాగానే జబ్బుకు గురయ్యే ఏర్పాట్లు జరుగుతున్నాయి. వాటి విషయాలు నీకు తెలిసే వుంటాయి. చెప్పగలవా?" అంది.

కమల మొహం వాడిపోయింది. "అవేమిటో నిజంగానే నాకు తెలియదు. బస్సు ప్రమాదంలో ఇరుక్కుపోయిన నన్ను వీళ్ళు రక్షించారు. నన్ను వీళ్ళ చేతులలో వుంచి మా అమ్మా నాన్నా మరణించారు. ఇంతకంటె ముందే మా దూరపు బంధువు మరియమ్మ నన్ను తనవద్ద వుంచి చదివించుకోవాలని ప్రయత్నించింది. అందుకే చనిపోయే ముందు మా నాన్న మరియమ్మను ఆస్తికి ట్రస్టీగా నియమించాడు. ఆమె మా నాన్నగారికి వదిన అవుతుంది. ఆమెను కూడా 'నాయనమ్మా' అనే పిలుస్తాను. మీరు ఈ ఇంట్లో ఏం గమనించారో దయచేసి చెబుతారా!" అంది.

"నీ కళ్ళ చుట్టూ నల్లటి వలయాలు ఏర్పడుతున్నాయి. నీకు ఒంట్లో నీరసంగా వుంటోంది. ఏ పని చేయాలన్నా ఉత్సాహం లేకుండా పోవడం జబ్బు లక్షణం. నిండా పద్దెనిమిదేళ్ళు లేనిదానికి, హుషారైన యవ్వనం జీవితంలో ప్రవేశిస్తున్న అమ్మాయికి ఈ లక్షణాలేమిటి?"

"అవును. ఏమిటవి?"

"నువ్వు ప్రత్యేకమైన కప్పులూ, పళ్ళాలూ వాడుతున్నావ్! అవునా?"

"ఒక్క నేనే అనేమిటి? ఇంట్లో అందరూ ఎవరి కప్పులు వాళ్ళే వాడతారు!"

"నీకు నీ పాత్రలు ఏర్పాటుచేయడానికే నీ పెంపుడు తండ్రి నియమం విధించాడు. రాత్రి నీ కప్పులో నువ్వు టీ తాగివుండవు. రాణిని తిట్టారట కదా! నేను మీ ఇంట్లో ప్రవేశించేటప్పటికి మీ ఇంట్లో అందరు ఏదో కోల్పోయిన వాళ్ళలాగా వున్నారు."

"అవును. రాత్రి చిన్న గొడవ చేశాడు నాన్న."

"ఎందుకు? నీ కప్పులో నువ్వే తాగాలి! నీ కప్పులో, నీ ప్లేటులో ఆర్సెనిక్ విషం పూసివుంటుంది. నీ కప్పు, ప్లేటు సంపాదించి పై గదిలో పరీక్షించాను. తోమిన కప్పులోనూ, ప్లేటులోనూ మరకలాగా ఆర్సెనిక్ పూసి వుంది. అఫ్‌కోర్స్... అది ఆర్సెనిక్ కాకపోవచ్చును. స్ట్రైక్‌నైన్ హైడ్రోక్లోరైడు కావచ్చును. ఏది ఏమయినప్పటికీ ఈ రెండు స్లో పాయిజన్స్‌లోనూ నీ శరీరంలో వున్నదేమిటో రక్త పరీక్షలో తేల్చుకోవచ్చును!"

కమల మొహం పాలిపోయింది.

"కంగారుపడక! వైద్యం చేయించుకోవచ్చును. శరీరంలోకి వచ్చి చేరుతూన్న స్లో పాయిజన్ శాతం తగ్గించుకోవచ్చును."

కమల చకచక దుస్తులు మార్చుకుంది. ఇద్దరూ జలాశయం నుండి తిరిగి బయలుదేరే లోగా రాణి వాళ్ళను చేరుకున్నది.

"మీ నాయనమ్మ వచ్చింది కమలా!" అంది రాణి.



ఇటీవల హైదరాబాద్ వంశీవారి ఆధ్వర్యంలో జరిగిన ఒక సభలో ధ్వన్యనుకరణ మాట్లాడే బొమ్మ (వెంట్రిలాక్విజమ్) ప్రదర్శించిన లోహిత్ కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ధ్వన్యనుకరణ సామ్రాట్ డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్

డాక్టర్ కొత్త రవీంద్రబాబు నవలిక

మా మంచి మాస్టారు

వస్తుంది త్వరలో

"మీ ఇద్దరూ నడవండి. రాత్రి చెట్టు కింద కారు వదలి పెట్టి వచ్చాను. ఎలా వుందో చూచివస్తాను!" అంది సౌజన్య.

అక్కా చెల్లెళ్ళు తలలూపి నడవడం మొదలు పెట్టారు.

## 4

"కమలకు జూన్ 14తో మైనారిటీ వెళ్ళిపోతోంది. ఆమెకు ఆస్తి ఒప్పచెప్పాల్సిన సమయం దగ్గరపడింది!" అంది మరియమ్మ.

కృష్ణారావు ఆమె వైపు అతి మామూలుగా చూచి, "అమ్మాయికి కబురుపెట్టాను. ఈ పాటికి బయలుదేరి వుంటారు!" అన్నాడు.

"ఎప్పుడు బయల్దేరారు ఇంటివద్ద?" అడిగింది సరస్వతమ్మ.

"రాత్రి. మాయదారి రైళ్ళు! వేళకు బయల్దేరి చావవు!" అంది మరియమ్మ.

ఆమె మాట ముగియకముందే కమలా, రాణి ఇంట్లోకి వచ్చారు.

"నాయనమ్మా!" అంది కమల. ఆమె గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

కృష్ణారావు దంపతులు నిర్లిప్తంగా చూస్తున్నారు. రాణి టీపాట్ లోంచి టీ కప్పులోకి ఒంపి మరియమ్మను సమీపించింది.

"అమ్మాయి ఆరోగ్యం పాడయిపోయింది. ఏవమ్మా, వైద్యం చేయించుకోవడంలేదా?" అడిగింది మరియమ్మ.

కమల ఎటూ సమాధానం చెప్పలేక కృష్ణారావువైపు చూచింది.

"అమ్మాయినీ, ఆమె ఆరోగ్యాన్నీ ఇంత నిర్లక్ష్యంగా వదిలివేస్తారని అనుకోలేదు. కనీసం ఆమెను కాలేజీలో నయినా చేర్పించారా లేదా?"

డ్రాయింగ్ రూంలో భయంకరమైన నిశ్శబ్దం పేర్కొని వుంది. మరియమ్మ గొంతు మాత్రమే మధ్య మధ్య వినిపిస్తోంది.

కృష్ణారావు ఒకసారి బయటకు చూచి, "మరియమ్మా!" అన్నాడు. అతడి గొంతు విచిత్రంగా మారిపోయింది. మరియమ్మా కమలా అటు చూశారు. వాళ్ళకు నోట మాట రాలేదు. కృష్ణారావు చేతిలో ఇనుపరాడ్ వుంది. ఆవేశంతో, ఉద్రేకంతో అతడు వణుకుతున్నాడనడానికి నిదర్శనంగా రాడ్ ఊగుతోంది.

"మరియమ్మా! నీ ప్రశ్నలకు ఓపిక పట్టాను. ఇక ఓపిక పట్టవలసిన అవసరం నాకు లేదు. ఆస్తి త్వరగా అమ్మాయిపేర స్వాధీనం చేస్తావా సరేసరి! లేకపోతే కమలకు మైనారిటీ తీరేవరకూ ఆమెనూ, నిన్నూ పై గదిలో బంధిస్తాను. ఆకలికి బలయి చచ్చిపోతారు పాపం!" అరిచాడు కృష్ణారావు.

మరియమ్మ క్షణాలలో తేరుకుంది. 'నువ్వు ఇంత దారుణానికి తయారవ్వడానికి కారణాలు కమల పేర వున్న ఆస్తే కదా! ఆల్‌రైట్! తీసుకో! మొత్తం తీసేసుకో! దానికి నా ఆస్తిలో కొంత భాగం ఇచ్చి ఎవరో ఒక అయ్య చేతిలో పెట్టి పంపిస్తాను. ఆడపిల్ల తలమీది ఆస్తికి ఆశపడే నువ్వు హత్యలు చేయడానికి కూడా వెనకడుగు వేయవు!" అంది.



హంసదౌత్యం

నఖచిత్రం: వల్ల పరిశినాయుడు,

నాగూరు

కృష్ణారావు పక పక నవ్వాడు. అతడి నవ్వు అంతలోనే ఆగిపోయింది. గదిలోకి సౌజన్య ప్రవేశించింది. కృష్ణారావు చటుక్కున ఇనుపరాడ్‌ను బల్లమీద వుంచి, అతి సాదాగా నవ్వాడు.

"మీరా? వెళ్ళిపోయారనుకున్నాను!" అన్నాడు కృష్ణారావు.

"వెళ్ళిపోలేదు. రక్తపరీక్ష చేయించడానికి తిరిగి వచ్చాను!" అంది సౌజన్య.

"రక్త పరీక్షా? ఎవరికి?"

"రాత్రి నేను మొదటిసారి ఈ గదిలోకి ప్రవేశించగానే రాణి టీ పోసి ఇవ్వాలని ప్రయత్నించింది. మీరు ఆమె చేతిలో టీపాట్ అందుకున్నారు. టీ చల్లారిపోయిందని అబద్ధం చెప్పి వాష్‌బేసిన్‌లో టీ పారపోసారు. బేసిన్‌లో ఒలుకుతున్న టీ పొగలు కక్కింది. మీరు అబద్ధం చెప్పడానికి కారణం నాకు ఈ తెల్లవారు జామున తెలిసింది!"

"ఏమిటది?"

"రాణి టీ ఒంపి ఇవ్వబోయిన కప్పులో విషం పూసివుంది. ఆ విషం కమల కోసం వుద్దేశించారు. కప్పు గోడలకూ, అడుగుభాగానికీ పూసివుంచారు. నాకు ఆ కప్పులోనే టీ ఇస్తే రుచి తెలుస్తుందేమోనని భయపడ్డారు. నేను క్రిమినల్ లాయర్‌నని మీకు తెలిసి వుండాలి!"

కృష్ణారావు తలవొంచుకున్నట్టే వొంచుకుని ఇనుపరాడ్ అందుకుని ముందుకు దూకాడు. కెమిస్ట్ లోపలకు వచ్చాడు. అతడు వచ్చినవెనుకనే పోలీస్ ఇన్‌స్పెక్టర్ పిస్తోలు గురిపెట్టి లోపలకు వచ్చాడు.

కృష్ణారావు మౌనంగా చేతులెత్తాడు. రాడ్ కిందకు జారిపోయింది. కంగుమని శబ్దమయింది.

సౌజన్య సైగ చేసింది. రక్త పరీక్ష చేసే కెమిస్ట్ కమలవైపు నడిచాడు.

"నో...నో... ఆమె శరీరంలో స్లో పాయిజన్ వుంది. నేరం నాదే! నన్నొక్కడినీ శిక్షించండి!" పిచ్చిగా అరుస్తున్నాడు కృష్ణారావు.

పోలీస్ ఇన్‌స్పెక్టర్ తలతిప్పి లాయర్ సౌజన్యను మెచ్చుకోలుగా చూశాడు.

"సౌజన్య గారూ! మీరు సమయానికి సహాయం తీసుకురాకపోతే మమ్మల్ని ఈ దుర్మార్గుడు చంపేసేవాడు" అంది మరియమ్మ.

"ఆవేశం అనర్థం! అత్యాశ అనర్థం! మనుషులు ఎప్పుడు తెలుసుకుంటారో!" అంది లాయర్ సౌజన్య.


రావినూతల సువర్ణాకన్నన్ * * * * * నవల గాలిగోపురం * * * * * త్వరలో ప్రారంభం